# సాక్షి
## అన్నమయ్య జిల్లా

ఆదివారం । 7 । మే । 2023





**పుస్తకాలు చదివేద్దాం.. కథలు రాసేద్దాం**

విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచేందుకు వేసవి సెలవుల్లో 'చదవటం మా కిష్టం' కార్యక్రమాన్ని విద్యాశాఖ రూపొందించింది. -IIలో..



**ఒంటిమిట్ట రామయ్య సన్నిధిలో న్యాయమూర్తులు**

ఒంటిమిట్ట కోదండ రామస్వామిని కడప, మచిలీపట్నం న్యాయమూర్తులు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. -IIలో..

**మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)**

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| మొదటిరకం | రూ.68 | రూ.74 |
| రెండోరకం | రూ.50 | రూ.64 |



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 564 మెట్రిక్ టన్నులు

**పట్టుగూళ్ల ధరలు (రూ.లో)**

| రకం | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| బైవోల్టిన్ | 495 | 505 |
| సీబీ | - | - |



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 504.32 కిలోలు

# వేడుకగా అన్నమయ్య జయంత్యుత్సవాలు



కల్యాణానికి హాజరైన భక్తులు

- తాళ్లపాకలో కమనీయంగా శ్రీవారికల్యాణం
- అన్నమయ్య వారసులకు టీటీడీ సత్కారం



శ్రీవారి కల్యాణంలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట : పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల 615 జయంత్యుత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలలో తొలి రోజున తాళ్లపాకలో శనివారం శ్రీవారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవర్లను వేదపండితులు కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. మధ్యాహ్నం 1 గంట వరకు అర్చకులు వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. పుణ్యహవచనం, పవిత్రహోమం, కంకణధారణ, మాంగళ్యధారణ, మంగళాశాసనం ఘట్టాలతో శ్రీవారి కల్యాణం జరిగింది. చివరగా నక్షత్రహారతి, మంగళ హారతి కార్యక్రమాలతో కల్యాణం ముగిసింది. భక్తులకు టీటీడీ మంచినీరు ,మజ్జిగ, ప్రసాదాలను అందించింది. పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులు అన్నప్రసాదాలను స్వీకరించారు. కాగా కల్యాణంలో జెడ్పీచైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, సర్పంచి గౌరీశంకర్, మున్సిపల్ వైస్‌చైర్మన్ మర్రి రవి, నాగిరెడ్డిపల్లె అర్బన్ సర్పంచి జంబు సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ రూరల్ అధ్యక్షుడు బొల్లినేని రామ్మోహన్‌నాయుడు, మాజీ సర్పంచి శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**అలరించిన సంకీర్తనాగోష్ఠిగానం**

అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు నిర్వహించిన సంకీర్తనా గోష్ఠిగానం భక్తులను అలరించింది. చెన్నైకు చెందిన సరిగమ మ్యూజిక్ కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు సంగీతసభ, తిరుపతికి చెందిన రమ్యకృష్ణ బృందం హరికథగానం చేశారు. కాగా అన్నమయ్య వారసులు హరిస్వామితోపాటు మరో ఇద్దరిని టీటీడీ ఘనంగా సత్కరించింది. టీటీడీ అధికారిణి హేమలత, టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్తు ధర్మాచార్యులు గంగనపల్లె వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

**వైభవంగా ఊంజల్‌సేవ:** కడప-రేణిగుంట నేషనల్‌హైవేలోని 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద శనివారం సాయంత్రం శ్రీవారి ఊంజల్‌సేవ వైభవంగా జరిగింది. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు ప్రసాద్, రేవతిబృందం అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. తిరుపతికి చెందిన నాగమణి బృందం హరికథ కార్యక్రమాలు నిర్వహించారు.

## పది ఫలితాలలో బాలికలదే పైచేయి

- టెన్త్ పరీక్షల్లో 72.05 శాతం ఉత్తీర్ణత
- బాలురు 68.33 శాతం, బాలికలు 75.81 శాతం ఉత్తీర్ణత
- ఉత్తీర్ణత శాతంలో రాష్ట్రంలో 15వ స్థానంలో అన్నమయ్య జిల్లా
- ప్రభుత్వ పాఠశాలలలో పెరిగిన ఉత్తీర్ణత శాతం
- జూన్ 2 నుంచి 10 వరకు టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

రాయచోటి: పదోతరగతి పరీక్షా ఫలితాలను ప్రభుత్వం శనివారం విడుదల చేసింది. ఈ ఏడాది కూడా అన్నమయ్య జిల్లాలో పది పరీక్షా ఫలితాలలో బాలికలదే పైచేయిగా నిలిచింది. జిల్లాలో పదవ తరగతి పరీక్షలను 22,219 మంది విద్యార్థులు రాశారు. వీరిలో బాలురు 11,158 మంది, బాలికలు 11,061 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఈ పరీక్షలలో 16,009 మంది బాల బాలికలు ఉత్తీర్ణత సాధించారు. దీంతో అన్నమయ్య జిల్లా 72.05 శాతంగా నిలిచింది. వీరిలో బాలురు 68.33 శాతం, బాలికలు 75.81 శాతం ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్ర వ్యాప్తంగా విడుదలైన ఫలితాలు అన్నమయ్య జిల్లా 72.02 శాతాన్ని సాధించి 15వ స్థానంలో నిలిచింది.

**కష్టపడి చదివారు......**

ఈ ఏడాది విద్యార్థులు బాగా కష్టపడి చదివారు. అందువల్ల గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ఉత్తీర్ణత శాతం ఎక్కువగా ఉందని జిల్లా ఇన్‌చార్జ్ డీఈఓ ప్రసాద్ బాబు తెలిపారు. అన్నమయ్య జిల్లాగా ఏర్పాటైన తొలి ఫలితాల్లోనే అందరి సహకారంతో మంచి ఫలితాలను సాధించాలని ప్రసాద్ బాబు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ పాఠశాలలలో కూడా విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరిగిందన్నారు.

**జూన్ 2 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు..**

పరీక్షలలో ఉత్తీర్ణత సాధించలేని విద్యార్థులకు జూన్ 2 నుంచి 10వ తేది వరకు సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు మంగళవారం నుంచి సప్లిమెంటరీ ఫీజు కట్టుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. ఉత్తీర్ణత సాధించలేని విద్యార్థులకోసం ప్రత్యేక తరగతులను నిర్వహించేలా ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయన్నారు. ఆర్మీ, ఇతర‌త్ర ఉద్యోగాలు, పై చదువుల ప్రవేశాలకు మార్కులు అవసరమవుతాయని, గ్రేడ్ల విధానాన్ని రద్దు చేస్తూ ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని జిల్లా ఇన్‌చార్జ్ విద్యాధికారి తెలియజేశారు.



## ఘనంగా ముగిసిన నల్లగంగమ్మ జాతర



దర్శనమిస్తున్న నల్లగంగమ్మ



ప్రత్యేక ఆకర్షణగా చాందినీబండి

సంబేపల్లె : దేవరరాయి నల్లగంగమ్మ జాతర శనివారం ఉదయంతో ఘనంగా ముగిసింది. మొక్కుబడులు తీరిన భక్తులు చాందినీబండ్లను ఆలయం చుట్టూ తిప్పారు. ఊరేగింపు సందర్భంగా చెక్కభజనలు, బ్యాండు మేళాలు, బాణసంచా పేలుళ్ల మధ్య కనుల పండుగ వాతావరణంలో సాగింది. అదే విధంగా నిర్వాహకులు ఏర్పాటు చేసిన జబర్దస్త్ కార్యక్రమం భక్తులను అలరించింది. రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా, రూరల్ సీఐ లింగప్ప, ఎస్‌ఐ పరీఫ్‌లు గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

## నేడు నీట్ అర్హత పరీక్ష

- ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా యంత్రాంగం

కడప ఎడ్యుకేషన్: ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ వైద్య విద్యలో ప్రవేశానికి జాతీయస్థాయిలో ఆదివారం నిర్వహిస్తున్న నీట్ అర్హత పరీక్షకు జిల్లాపాలనా యంత్రాంగం ఏర్పాటు చేసినట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కోఆర్డినేటర్ హరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. నీట్ ప్రవేశ పరీక్షకు జిల్లాలో నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాలుగు పరీక్షా కేంద్రాలలో 2185 మంది ఈ పరీక్షకు హాజరవుతున్నారని తెలిపారు. ఇందులో కడపలోని ఇంటర్నేషనల్ డిల్లీ పబ్లిక్ స్కూల్, యస్‌వీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, అన్నమాచార్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సు కళాశాలతోపాటు ఖాజీపేట మండలంలో భీరం శ్రీధర్‌రెడ్డి ఇంటర్నేషనల్ స్కూల్స్‌ను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నీట్ పరీక్షకు ఉదయం 11 గంటల నుంచే విద్యార్థులను పరీక్షా కేంద్రాలలోకి అనుమతిస్తామన్నారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.20 వరకు కొనసాగుతుందని తెలిపారు.




పరీక్షా కేంద్రాలలో ఏర్పాట్లపై సూచనలు ఇస్తున్న అబ్జర్వర్ అమృత్ ప్రసాద్‌రెడ్డి

## పెంచలకోన జాతర ఆర్టీసీ ఆదాయం రూ.14 లక్షలు

కడప కోటిరెడ్డిసర్కిల్: నెల్లూరు జిల్లా పెంచల కోన జాతరకు ఏపీఎస్ ఆర్టీసీ ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని బద్వేలు, రాజంపేట డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడిపామని, వాటి ద్వారా రూ. 14,34,519 ఆదాయం ఒనగూరిందని కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపినాథ్‌రెడ్డి తెలిపారు. ఈనెల 3 నుంచి 5వ తేది వరకు ఈ బస్సులను నడిపామన్నారు. బద్వేలు డిపో నుంచి 12 బస్సులు 82 ట్రిప్పులు నడపగా రూ. 5,59,570 ఆదాయం వచ్చింది. అలాగే రాజంపేట డిపో నుంచి 20 బస్సులు 133 ట్రిప్పుల ద్వారా రూ. 8,74,949 ఆదాయం ఒనగూరిందన్నారు.

## డీఎస్పీల బదిలీ

కడప అర్బన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో పనిచేస్తున్న డీఎస్పీలలో నలుగురు బదిలీ అయ్యారు. రాజంపేట డీఎస్పీగా పనిచేస్తున్న జి.శివభాస్కర్‌రెడ్డిని కుప్పం డీఎస్పీగా బదిలీ చేశారు. వెయిటింగ్‌లో వున్న ఎస్. రమాకాంత్ వైఎస్‌ఆర్ జిల్లా కడప దిశ డీఎస్పీగా నియమితులయ్యారు. ఇటీవల జమ్మలమడుగు నుంచి ఏసీబీ డీఎస్పీగా బదిలీ అయిన ఎన్.నాగరాజు తిరిగి పూర్వస్థానానికే వచ్చారు. జమ్మలమడుగు డీఎస్పీగా ఉన్న బి.ఉమామహేశ్వర్ రెడ్డిని గుంటూరు వెస్ట్ డీఎస్పీగా బదిలీ చేశారు.

## నేటి నుంచి క్రికెట్ శిక్షణ

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో ఈనెల 7వ తేదీ ఆదివారం నుంచి క్రికెట్ వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్‌ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) జిల్లా కార్యదర్శి అవ్వారు రెడ్డి ప్రసాద్, ఆపరేషన్స్ డైరెక్టర్ ఎస్.ఖాజా మైనుద్దీన్ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆధార్‌కార్డు, జనన ధృవీకరణపత్రం, ఫొటోతో హాజరై తమపేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ ఉదయం 6 నుంచి 8.30 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు ఇలియాస్ 8452952984, అన్వర్ 9618883665 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



## న్యూస్‌రీల్

### అన్నమయ్యకు నివాళి



అన్నమయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న జిల్లాకలెక్టర్

రాయచోటి : పదకవితా పితామహుడు, తొలి తెలుగు వాగ్గేయకారుడు శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులు అని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. రాయచోటిలోని కలెక్టరేట్‌లో జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో తాళ్లపాక అన్నమాచార్యుల జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాళ్లపాక అన్నమాచార్యుల చిత్రపటానికి కలెక్టర్ గిరీషా పీఎస్, డీఆర్‌ఓ సత్యనారాయణ, జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగభూషణం, కలెక్టరేట్ ఏఓ బాలకృష్ణలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### హార్సిలీహిల్స్‌కు ప్రత్యేక బస్సు సర్వీసులు

మదనపల్లె సిటీ: ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌కు ప్రతి శని, ఆదివారాల్లో ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ 1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లె నుంచి ఉదయం 6.30, 8.30 గంటలకు.. మధ్యాహ్నం 2.20, 5.30 గంటలకు బయలుదేరుతాయన్నారు. హార్సిలీహిల్స్ నుంచి ఉదయం 7.30, 9.40.. సాయంత్రం 4.30, 6.30 గంటలకు బయలుదేరుతాయన్నారు. మిగిలిన రోజుల్లో ఒక ట్రిప్ సాయంత్రం నడుస్తాయన్నారు. ఈ అవకాశాన్ని పర్యాటకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### శైవ క్షేత్రాలకు..




కడప కోటిరెడ్డి సర్కిల్ : జిల్లాలోని పొలతల, నిత్యపూజ కోనలకు ప్రతి సోమవారం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని కడప ఆర్టీసీ రీజినల్ మేనేజర్ పి.గోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జమ్మలమడుగు డిపో నుంచి ప్రతి సోమవారం ఉదయం 6 గంటలకు పొలతలకు బస్సును ఏర్పాటు చేశామన్నారు. ఈ బస్సు ప్రొద్దుటూరు, కడప మీదుగా పొలతలకు వెళుతుందన్నారు. తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు పొలతలలో బయలుదేరి రాత్రి 7 గంటలకు జమ్మలమడుగుకు చేరుతుందన్నారు. అలాగే ప్రొద్దుటూరు డిపో నుంచి మరో బస్సు ఉదయం 6.30 గంటలకు బయలుదేరి మైదుకూరు, కడప, భాకరాపేట మీదుగా ఉదయం 10.00 గంటలకు నిత్యపూజకోనకు చేరుతుందన్నారు. తిరిగి మధ్యాహ్నం 3.30 గంటలకు ఇదేమార్గంలో ప్రొద్దుటూరుకు సాయంత్రం 7 గంటలకు చేరుతుందన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### 12న వేలాంగిణికి..

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రీజియన్ పరిధిలోని వివిధ డిపోల నుంచి ఈనెల 12వ తేదీన వేలాంగిణికి సూపర్ లగ్జరీ బస్సులు నడపనున్నామని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ గోపాల్ రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రమైన కడప డిపో నుంచి రాత్రి 8.00 గంటలకు బస్సు బయలుదేరుతుందన్నారు. ఒక్కొక్కరికి రానుపోను రూ.2200 చార్జీగా ఉంటుందన్నారు. అలాగే మైదుకూరు డిపో నుంచి సాయంత్రం 7.00గంటలకు బయలు దేరుతుందన్నారు. చార్జి రూ.2200గా ఉందన్నారు. జమ్మలమడుగు డిపో నుంచి సాయంత్రం 4.00 గంటలకు బయలుదేరే సర్వీసులో చార్జి రూ.2600గా నిర్ణయించారన్నారు. బద్వేలు డిపో నుంచి సాయంత్రం 7 గంటలకు బయలుదేరే బస్సులో చార్జి రూ. 2400గా ఉంటుందన్నారు. ఈ బస్సులు తిరుపతి, తిరుత్తణి, కంచి, నాగపట్నం మీదుగా మరుసటిరోజు ఉదయం వేలాంగిణికి చేరుతుందన్నారు. తిరిగి ఆదివారం ఉదయం 11 గంటలకు వేలాంగిణి నుంచి ఈ బస్సులు బయలుదేరి ఇదే మార్గంలో ఆయా ప్రాంతాలకు చేరుతాయన్నారు.

# టమాట పంటపై ఉష్ణోగ్రతల ప్రభావం

- కాయలపై పసుపు రంగు.. తగ్గిన పరిమాణం
- సూచనలు చేస్తున్న శాస్త్రవేత్త శేషకిరణ్



సైజు తగ్గి, పసుపు రంగులోకి మారిన టమాటాలు



టమాటలోపల గోధుమ రంగు

బి.కొత్తకోట: జిల్లాలో గత మూడు వారాలుగా పెరిగిన ఉష్ణోగ్రతలు టమాట పంటపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దిగుబడులకు ధరలు లేక అల్లాడిపోతున్న రైతాంగానికి ఉష్ణోగ్రతలు ఆందోళన కలిగిస్తున్నాయి. టమాట ధరలు తగ్గి పెట్టుబడులు కూడా దక్కని పరిస్థితి నెలకొంది. అధిక ఉష్ణోగ్రతల కారణంగా టమాట కాయలు నిర్ణీతమైన పరిమాణంలోకి రావడం లేదు. కాయలు పసుపురంగులోకి మారుతున్నాయి. కాయలపైన తోలు ఒలిచాక గోధమ రంగు మచ్చలు కనిపిస్తున్నాయి. కాయల తోలు కూడా సరిగా వృద్ధికాక ధృడత్వం కోల్పోతోంది. ఈ పరిస్థితుల్లో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని మండలంలోని బయ్యప్పగారిపల్లె ఉద్యాన పరిశోధన స్థానం తెగుళ్ల విభాగం సీనియర్ శాస్త్రవేత్త శేషకిరణ్ సూచనలు చేస్తున్నారు.

- సీవీడ్ ఎక్స్‌ట్రాక్ట్‌ను రెండు మిల్లీలీటర్లు ఒక లీటరు నీటిలో కలిపి తయారుచేసిన ద్రావణాన్ని మొక్కలపై పిచికారి చేయాలి. అలాగే గిబ్బెరిల్లిక్ యాసిడ్ హార్మోన్ పొడిని లీటర్ నీటికి 75 మిల్లీగ్రాముల చొప్పున కలిపి మొక్కలపై పిచికారి చేస్తే పంట నష్టాలను నివారించవచ్చు. పంటను బెట్టకు గురికాకుండా నీటి తడులు ఇవ్వాలి.
- సీవీడ్ ఎక్స్‌ట్రాక్ట్‌ను ఉద్యాన పంటలపై పిచికారి చేయడం ద్వారా తెగుళ్ల, పురుగులు నివారణేకాక పోషక లోపాలు, అధిక, అత్యల్ప ఉష్ణోగ్రతల వల్ల కలిగే నష్టాలను గణనీయంగా తగ్గిస్తుంది. మొక్కలకు కావలసిన ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్‌తోపాటు సూక్ష్మ పోషకాలైన కాపర్, జింక్, ఐరన్, మాంగనీస్ మరియు మొక్కల ఎదుగుదలకు అవసరమైన ఆక్సిన్, గిబ్బెరిల్లిక్ యాసిడ్, సైటోకైనెన్ హార్మోన్లు లభించడం వల్ల మొక్కల ఎదుగుల, అధిక దిగుబడులు సాధించవచ్చని శేషకిరణ్ తెలిపారు. ఈ సూచనలు పాటించి రైతులు అధిక ఉష్ణోగ్రతల నుంచి పంటలను కాపాడుకోవాలని కోరారు.

## వెల్లాలలో నేడు రథోత్సవం

**రాజుపాళెం :** వెల్లాల గ్రామంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం రథోత్సవం (తిరునాల) కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి శ్రీ చెన్న కేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాములను దర్శించుకోనున్నారు. 11 గంటల సమయంలో ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, హోమాలు చేసిన తర్వాత రథంలో ఆశీనులను చేసి గ్రామం లోని వీధుల్లో ఊరేగించనున్నారు.

**నేడు బండలాగుడు పోటీలు**

వెల్లాల గ్రామంలో ఆదివారం రాష్ట్రస్థాయి సీనియర్ వృషభరాజములకు బండలాగుడు పోటీలను నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి తెలిపారు. ఇందులో గెలుపొందిన ఎడ్లకు మొదటి, రెండవ, మూడవ, నాల్గవ, ఐదవ, ఆరవ బహుమతులుగా రూ.1,10,000, రూ.75,000, రూ.50,000, రూ.30,000, రూ.20,000, రూ.10,000, మిగిలిన ఎడ్లకు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తామని వారు చెప్పారు.

**రేపు ఒంటెద్దు బండలాగుడు పోటీలు**

ఒంటెద్దు బండలాగుడు పోటీలను సోమవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి తెలిపారు. అందులో గెలుపొందిన ఎద్దు యజమానులకు బహుమతులు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.



# పుస్తకాలు చదివేద్దాం.. కథలు రాసేద్దాం

- చదవటం మా కిష్టం కార్యక్రమానికి శ్రీకారం
- ఒక్కో ఉపాధ్యాయునికి 15 మంది విద్యార్థులు దత్తత
- విద్యాశాఖాధికారుల పర్యవేక్షణ

**జిల్లా సమాచారం** (ప్రభుత్వ పాఠశాలలు)

| | |
|---|---|
| ప్రాథమిక | : 1,709 |
| ప్రాథమికోన్నత | : 214 |
| ఉన్నత | : 296 |
| మొత్తం విద్యార్థులు | : 1,54,789 |




**మదనపల్లె సిటీ :** విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచడం ద్వారా నిష్ణాతులైన చదువరిగా తయారు చేయాలనే లక్ష్యంతో వేసవి సెలవుల్లో 'చదవటం మా కిష్టం' కార్యక్రమాన్ని విద్యాశాఖ రూపొందించింది. దీన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రతి పాఠశాలలో పది నుంచి పదిహేను మంది విద్యార్థులను ఒక్కో ఉపాధ్యాయునికి దత్తత ఇచ్చారు. జూన్ పదో తేదీ వరకూ నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు నిరంతరం పర్యవేక్షించాలని విద్యాశాఖ అధికారులు ఆదేశాల్లో పేర్కొన్నారు.

**అమలు విధానం**

చదవటం మా కిష్టం... సోమవారం (ఒకటో తేదీ) నుంచి ప్రారంభమైంది. రోజూ ప్రతి విద్యార్థి ఒక కథ చదవాలి. విద్యార్థి పఠనా సామర్థ్యం ఆధారంగా 3 నుంచి 10 కథల పుస్తకాలు పాఠశాల గ్రంథాలయం నుంచి ఇచ్చారు. దత్తత తీసుకున్న ఉపాధ్యాయులు వీరు కథలు చదివేలా ప్రోత్సహిస్తుంటారు. అలాగే ఉపాధ్యాయుడు కూడా దత్తత విద్యార్థితో ఏర్పాటు చేసుకున్న వాట్సాప్ గ్రూపుతో ఒక్కో కథ పోస్ట్ చేస్తుంటారు. విద్యార్థి దీన్ని కూడా చదవాలి. తరువాత తాను చదివిన కథపై అభిప్రాయాన్ని, నీతిని, చిత్రరూపంలోనో, అక్షర రూపంలోనో తిరిగి వాట్సాప్ బృందంలో పెట్టాలి. దానిపై ఉపాధ్యాయులు తగిన సూచనలు ఇవ్వాలి. తల్లిదండ్రులు కూడా విద్యార్థి పఠనాసక్తిని గమనించాలి. ఆసక్తి ఉన్న విద్యార్థి తన సొంత మాటల్లోనూ కథ రాసి పోస్టు చేయెచ్చు. విద్యార్థి ఆసక్తిని బట్టి మూడు స్థాయిల్లో (తరగతుల ఆధారంగా) వివిధ అంశాలపై పోటీలు నిర్వహిస్తారు.

**విద్యార్థులు ఏం చేయాలి:**

- కథ చదివిన తరువాత ప్రతి విద్యార్థి ఆ పుస్తకంపై తన అభిప్రాయాన్ని రాత పుస్తకంలో రాసుకోవాలి.
- కథలో పాత్రలు, సన్నివేశాలు, బొమ్మలపై తమ భావాలను వాట్సాప్ గ్రూపుల్లో ఇతరులతో పంచుకోవాలి.
- విద్యార్థులు తమ బంధువుల ఇళ్లకు వెళ్తే, అక్కడి పుస్తకాల వివరాలు సేకరించి తనతో పాటు తీసుకెళ్లిన రాత పుస్తకంలో రాసుకోవాలి.
- పాత వార్త పత్రికలు, మ్యాగ్‌జైన్లు సేకరించి అందులో ఒకే రకమైన ఆసక్తి ఉన్న చిత్రాలను కత్తిరించి పుస్తకంలో అతికించాలి.
- వాట్సాప్ గ్రూపులోని విద్యార్థులు చదివిన కథలను పరస్పరం చెప్పుకోవాలి.
- పాత వార్తపత్రికలు, ఆదివారం అనుబంధం పుస్తకాల్లోంచి కథలు సేకరించి వాటిని రాత పుస్తకాల్లో రాసుకోవాలి.
- ఇలా రాసుకున్న వాటి ఆధారంగా సొంతంగా కథలు రాయాలి.

**విద్యార్థులకు పోటీలు**


విద్యార్థులు నేర్చుకున్న అంశాలను మూడు స్థాయిలుగా విభజించారు.

**స్థాయి 1 :** 3 నుంచి 5వ తరగతి వరకు పోటీలకు అర్హులు. వీరు ఏదైనా ఒక కథనాన్ని ఎంచుకుని చదివి రికార్డ్ చేసి దానిని విద్యాశాఖ ఇచ్చిన మెయిల్‌కు పంపాలి.

**స్థాయి 2 :** 6 నుంచి 8వ తరగతి వరకు పాల్గొనవచ్చు. వీరు కూడా ఏదైనా ఒక కథ సొంతంగా రాసి దానిపై స్కాన్ చేసి సంబంధిత మెయిల్‌కు పంపాలి.

**స్థాయి 3 :** ఇందులో 9 నుంచి 12 తరగతి వరకు, డైట్ కళాశాల విద్యార్థులు పాల్గొనవచ్చు. వీరు చదివిన పుస్తకంపై సమీక్ష లేదా సొంత కథను రాసి సంబంధిత మెయిల్‌కు పంపాలి.

**సెలవుల్లో మంచి అవకాశం**



వేసవి సెలవుల్లో చదవటం మా కిష్టం కార్యక్రమం మంచి అవకాశం. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంచే విలువైన పుస్తకాలను అందించాం. కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థులకు పఠనాశక్తితోపాటు సృజనాత్మకత, భాషాభివృద్ధి, పుస్తకపఠనంపై అభిరుచి పెంచడానికి సహాయ పడుతుంది.
– పి.మహమ్మద్‌ఖాన్, టీచర్, జెడ్పీహెచ్‌ఎస్, మదనపల్లె

**పఠనాసక్తి పెంపే లక్ష్యం**



విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచడానికి ఈ కార్యక్రమాన్ని అధికారులు రూపొందించారు. తద్వారా బడులు తెరిచిన తరువాత పాఠ్య పుస్తకాలను కూడా ఇష్టంగా చదువుతారు. చదువులో ప్రతిభ కనబరచడానికి మార్గం సుగమం అవుతుంది. విద్యార్థుల్లో సృజనాత్మకత, వైఖర్లు, భాషపై పట్టు అభివృద్ధి చెందుతాయి. ఉత్తమ ఫలితాలు వస్తాయి.
– ఫణీంద్ర, టీచర్, జెడ్పీహెచ్‌ఎస్, మదనపల్లె

## పేదరికం లేని సమాజమే సీఎం ఆశయం

**రాజంపేట టౌన్ :** రాష్ట్రంలో పేదరికం లేని సమాజాన్ని స్థాపించడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబర్ శంకర్‌నాయక్ అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పుల్లంపేట మండలం బావికాడిపల్లె పంచాయతీలోని ఎస్టీ కాలనీలో నెలకొన్న సమస్యలపై తమకు ఫిర్యాదు అందగా అక్కడి ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ఆ గ్రామాన్ని పరిశీలించామన్నారు. ఆ గ్రామంలోని ప్రజలు పలు సమస్యలను తమ దృష్టికి తీసుకురాగా తమతోపాటు ఉన్న అధికారులు వెంటనే వారి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అందులో ప్రధానంగా నీటి సమస్య పరిష్కారానికి ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి ప్రసన్నకుమార్ వెంటనే చర్యలు తీసుకుంటామని తెలియజేశారన్నారు. అలాగే శ్మశాన వాటికకు స్థలం కావాల్సి ఉందని కోరగా తహసీల్దార్ సుబ్రహ్మణ్యంరెడ్డి అర్థ ఎకరా కేటాయిస్తామన్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కాగృహాలు, గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారన్నారు. ఎస్టీ కాలనీలో సమస్యల పరిష్కారానికి ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని చెప్పినట్లు తెలిపారు. దీంతో ఆ గ్రామ ప్రజలు తమ కాలనీకి జగనన్న ఎస్టీ కాలనీగా అప్పటికప్పుడే నామకరణం చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి, కడప, రాజంపేట పార్లమెంటు ఎస్టీ సెల్ అధ్యక్షులు వేణుగోపాల్‌నాయక్, నాగేశ్వర్ నాయక్, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకుడు దాసరి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ మెంబర్ శంకర్‌నాయక్

## విద్యారంగంలో అశాస్త్రీయ భావజాలాన్ని అడ్డుకుందాం

**రాయచోటి అర్బన్ :** విద్యారంగంలో అశాస్త్రీయ భావజాలాన్ని అడ్డుకుందామని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యదర్శి విక్కీ మహేసరి అన్నారు. శనివారం స్థానిక ఎన్‌జీఓ సభా భవనంలో జరిగిన ఏఐఎస్‌ఎఫ్ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాస్త్రీయ భావజాలన్ని అభివృద్ధి చేయాల్సిన ప్రభుత్వం మూఢ నమ్మకాలను ప్రోత్సహించేలా పాఠ్యాంశాలను మార్చాలనుకోవడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. డార్విన్ సిద్ధాంతాన్ని పాఠ్యాంశంగా తొలగించి తద్వారా మూఢనమ్మకాలనే విషబీజాలను నాటడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తుండటం దారుణమన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం ఇలాంటి భావజాలం విస్తరణను మానుకోవాలని, లేనిపక్షంలో విద్యార్థులంతా ఏకమై భవిష్యత్తు పోరాటాలకు శ్రీకారం చుడతారంటూ హెచ్చరించారు. రెజర్ల న్యాయ సమ్మతమైన డిమాండ్‌ను పరిష్కరించకపోగా వారిపై పోలీసులతో దాడులు చేయించడం సిగ్గుచేటన్నారు. అనంతరం ఏఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు మాజీ జి.ఈశ్వరయ్య, రాష్ట్రప్రధాన కార్యదర్శి శివారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లవకుమార్, కోటేశ్వరరావు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేష్, సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు విశ్వనాథనాయక్, సాంబశివ, ఏఐఎస్‌ఎఫ్ మహిళా అధ్యక్షురాలు సౌందర్యతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విక్కీ మహేసరి



## రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల్లో ముమ్మర తనిఖీలు

**మదనపల్లె :** కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు ఈ నెల 10న జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల్లో ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) అధికారి టి.విజయశేఖర్ తెలిపారు. అందులో భాగంగా శనివారం మండలంలోని చీకిలబైలు, రామసముద్రం మండలంలోని రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కర్ణాటక ఎన్నికల సందర్భంగా అక్రమ మద్యం, నగదు రవాణా అరికట్టడమే ధ్యేయంగా తనిఖీలు పటిష్టం చేసినట్లు తెలిపారు. ఎస్‌ఈబీ అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించి క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. సరిహద్దు దాటే అన్ని వాహనాల్లో తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తులను, వాహనాలను వెంటనే గుర్తించాలన్నారు. తనిఖీలకై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**కర్ణాటక మద్యం స్వాధీనం**

వాహనాలను జిల్లా ఎస్‌ఈబీ అధికారి టి.విజయశేఖర్ స్వయంగా పరిశీలించి తనిఖీలు నిర్వహించారు. అందులో భాగంగా ప్రైవేటు బస్సులో 40 కర్ణాటక మద్యం ప్యాకెట్లను తరలిస్తున్న మదనపల్లె చంద్రకాలనీకి చెందిన బుక్యా శంకర్ నాయక్ (36)ను అరెస్ట్ చేశారు. నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఈబీ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ పి.శ్రీహరిరెడ్డి, బోర్డర్ మొబైల్ పార్టీ సబ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, సిబ్బంది త్రిపురేంద్రుడు, హరికుమార్, మునిరామయ్య, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.



కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుంటున్న ఎస్‌ఈబీ అధికారి, సిబ్బంది

## ఒంటిమిట్ట రామయ్యను దర్శించుకున్న న్యాయమూర్తులు

**ఒంటిమిట్ట :** ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామస్వామిని కడప జిల్లా కోర్టు న్యాయమూర్తి వీ.ఎస్ ఆంజనేయమూర్తి, మచిలీపట్నం ప్రిన్సిపల్ జిల్లా న్యాయమూర్తి అరుణ సారిక కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అధికారులు ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ రంగమండపంలో స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. వీరి వెంట సిద్దవటం జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ కల్యాణ్, ఒంటిమిట్ట తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి ఉన్నారు.



ఆలయ ఆవరణలో కడప జిల్లా, మచిలీపట్నం జిల్లా న్యాయమూర్తులు

## కనుల పండువగా నరసింహుని కల్యాణం



స్వామి, అమ్మవారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

**పెండ్లిమర్రి :** మండలంలోని వెయ్యినూతల కోనలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి, లక్ష్మీదేవి అమ్మవారి కల్యాణోత్సవం శనివారం కనుల పండువగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కనులారా తిలకించారు. ముందుగా భక్తులు కోనేర్లలో స్నానాలు అచరించి స్వామి వారికి మొక్కులు చెల్లించి కల్యాణంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం గజవాహన సేవ, సాయంత్రం ధ్వజ అవరోహణం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కల్యాణం అనంతరం స్వామివారిని కోనేటి వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లి చక్రస్నానం చేశారు. ఉత్సవాలు నాలుగు రోజుల పాటు వైభవంగా జరిగాయి. ఆలయ ఆవరణలో భక్తులకు పలువురు దాతలు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వంశ పారంపర్య ధర్మకర్త పి.నరసింహ హరిప్రసాద్, వేదపండితులు పాల్గొన్నారు.

## 13న జాతీయ లోక్ అదాలత్

**కడప అర్బన్ :** జాతీయ న్యాయసేవాధికార సంస్థ, ఏపీ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశానుసారంగా జిల్లాలో న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 13న జిల్లా వ్యాప్తంగా జాతీయలోక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఈక్రమంలో శనివారం కడపలోని జిల్లా కోర్టు ఆవరణలో పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి సీఎస్ మూర్తి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులను పరిష్కరించుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎం.ప్రదీప్‌కుమార్, అన్నమయ్య జిల్లా రాయచోటి అదనపు ఎస్పీ డాక్టర్ వి.రాజ్‌కమల్, జమ్మలమడుగు డీఎస్పీ ఎస్.నాగరాజు, ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చిన సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి సీఎస్ మూర్తి

## ఉరేసుకొని వ్యక్తి మృతి

**సిద్దవటం :** మండల పరిధి జేఎంజే కళాశాల సమీపంలోని కోతులమోరికి రైల్వే ట్రాక్ అవతల వైపు గుర్తు తెలియని మగ వ్యక్తి (40) చెట్టుకు ఉరేసుకొని మృతి చెందాడు. మృతుడు ఆరెంజ్ కలర్ లుంగీ, తెల్లరంగు, నలుపు, ఎరుపు రంగు అడ్డచారలు గల టీషర్టు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు.

## విద్యార్థి ఆత్మహత్యాయత్నం

**మదనపల్లె :** ఇంటర్ ఫెయిల్ కావడంతో మనస్తాపం చెందిన విద్యార్థిని ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన పీటీఎం మండలంలో శనివారం జరిగింది. దేవళంపేటకు చెందిన ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని (17) ఇటీవల విడుదలైన ఫలితాల్లో పరీక్ష ఫెయిల్ అయ్యింది. దీంతో ఫలితాలు వచ్చినప్పటి నుంచి ముభావంగా ఉంటోంది. మనస్తాపంతో శనివారం పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

**కుటుంబ సమస్యలతో మహిళ**

కుటుంబ సమస్యల కారణంగా మనస్తాపం చెందిన ఓ మహిళ ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన శనివారం మదనపల్లె పట్టణంలో జరిగింది. నీరుగట్టువారిపల్లెకు చెందిన నరసయ్య మహాలక్ష్మి (44) కూలీ పనులు చేస్తూ జీవిస్తోంది. ఈ క్రమంలో శనివారం కుటుంబ సమస్యలపై భర్తతో గొడవపడింది. దీంతో మనస్తాపం చెంది క్రిమి సంహారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు బాధితురాలిని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్సల అనంతరం కోలుకుంటోంది.

## ఆగిన ట్రాక్టర్‌ను ఢీకొన్న ట్యాంకర్

**– ఒకరికి తీవ్ర గాయాలు**

**బి.కొత్తకోట :** రోడ్డు పక్కన ఆగివున్న ట్రాక్టర్‌ను వెనుకవైపు నుంచి పాల ట్యాంకర్ ఢీకొన్న సంఘటన శనివారం మండలంలోని నాయనబావి వద్ద జరిగింది. ఎస్‌ఐ కె.రామమోహన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బడికాయలపల్లెకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ టి.వెంకటరమణ(27) ఇనుపకమ్మిలతో మదనపల్లె వైపు వెళ్తున్నాడు. మార్గంమధ్యలో నాయనబావి వద్ద ట్రాక్టర్‌ను రోడ్డుపక్కన నిలిపి ఉంచాడు. ఈ ట్రాక్టర్‌కు ముందు బి.కొత్తకోటకు చెందిన ఇంతియాజ్ బైక్‌లో మదనపల్లె వెళ్తూ రోడ్డుపక్కన నిలబడ్డాడు. ఇదే సమయంలో బి.కొత్తకోట నుంచి తిరుపతికి పాలతో వెళ్తున్న ట్యాంకర్ వేగంగా వెళ్తూ రోడ్డుపక్కన నిలిపిన ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ట్రాక్టర్ ఎదురుగా బైక్‌పై ఉన్న ఇంతియాజ్‌ను ఢీకొంది. ఈ ప్రమాదాన్ని పసిగట్టిన ఇంతియాజ్ బైక్‌పై నుంచి పక్కకు దూకేయడంతో ట్రాక్టర్ బైక్‌పైకి దూసుకురావడంతో పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ వెంకటరమణకు కుడికాలు విరగడంతో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో ఇంతియాజ్ త్రుటిలో తప్పించుకోవడంతో ప్రమాదం తప్పింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.